## ౩౮

# మేకవన్నె పులులు

చలికాలం.

పగలు కుదించుకుని, దీర్ఘరాత్రికి నాందిగా చీకటి తెర తొలిఛాయలు ఆ ఫైవ్ స్టార్ హోటలు ఆధునిక బురుజుల మీదికి జారుతున్నాయి. అశోక పత్రాల సందుల్లోంచి చలిగాలి నిట్టూరుస్తో, పదమూడో నంబరు గది తలుపుల్ని తాకి, లోపల్నించి లీకవుతోన్న శైత్యాన్ని తాగుతోంది.

బయట శీతలం-

లోపల సమశీతలం-

ఆ గదిలో, ఎడారిలాంటి ఏకాంతంలో, గండభేరుండాల్లాంటి రెండు మానవాకారాలు-

గొంతుల్లోకి చల్లని, మరింత చల్లని పానీయాన్ని వొంపుకుంటున్నాయి. గుండెల నిండా వేడి నింపుకుంటున్నాయి.

సీసాలు ఖాళీ....

గ్లాసుల్లో సగం ఖాళీ....

'ఒకటి...' అన్నది వో ఆకారం. పేరు-సత్యం.

'ఊ... హు... నాలుగు....' అన్నది రెండో ఆకారం-స్వామి.

'ఆల్రైట్... నాలుగు...'

'ఏయ్...బాయ్...'

పరుగెత్తుకొచ్చేడు వెయిటర్.

'ఇంకో బాటిలు, వో సోడా...'

వెళ్ళి పోయేడు బోయ్.

'యింకా నాలుగురౌండ్లు పట్టించాలన్నమాట!'

'ఏం నాన్నా... కష్టంగా వుందా?'

'ఎందుకు కష్టం? ఓడిపోయిన వాణ్ణి. మనశ్శాంతికైనా తాగాలిగా!'

'మనస్సూ... దానికోశాంతీ... వాటే పేరడాక్స్!! అందుకు నాచేతి తడి ఆరాలన్న మాట!!'

'ఓ యబ్బో! ఇదేదో నీ చేతిది ఖర్చు పెట్టేస్తున్నట్టు... ఖర్చు పెట్టున్నవాళ్ళు వేరే వున్నారు... వాళ్ళు సొంత ఖర్చుమీద 'గుడుంబా' తాగుతూ వుంటారు. వాళ్ళకిది అదృశ్య వ్యయం'

బాయ్ బాటిలు తెచ్చేడు.

రెండు వరసలు అయిపోయేయి.

'బాయ్...'

మూడో సారి గ్లాసులు నింపుతూ పిల్చేడు సత్యం.

వెయిటర్ వాయుపుత్రుడిలా ప్రత్యక్షమయేడు.

'ఇదేం బాగోలేదు.'

'సరుకు మంచిదే సార్...'

తేరిపార జూసేడు సత్యం.

'నిన్నుగాదోయ్...'

'మరి పిల్చారెందుకు సార్...'

'పిల్చేనా... వూఁ... హు... అవును... ఉక్కగా వుంది. ఎయిర్ కండిషన్ అన్చేయి....'

'చేసే వుంది సార్...'

'చేసే వుందా?వూఁ.... అయితే వెళ్లు....'

వెళ్ళిపోయేడు.

'ఇదేం బాగోలేదు' అన్నాడు మళ్లీ- గ్లాసు పైకెత్తుతూ-

గుక్క మింగటంలో కొంచెం ఆలస్యం చేసి-

'ఏఁవిటి?' అనడిగేడు స్వామి.

'మీవాళ్లు మా వాళ్లని కొట్టడం'

'ఇదేదో ఇవాళే కొత్తగా జరిగినట్టు చెబుతావేం? అది కార్మిక సంఘాలు పుట్టినప్పట్నుంచీ సాగుతోన్న వ్యవహారమే. ఆ మాటకొస్తే... అదే అసలు మన మనుగడకి ఇంధనం...'

'ఉహు... మంచిది కాదు'

'ఏవిటోయ్... నిషా యెక్కి మరీ మంచోడివైపోయేవు. గత యెన్నికల్లో మీవాళ్లు మావాడి తల పగలగొట్లా?'

సమాధానాన్ని రెండు గుక్కల్లో మింగేసేడు సత్యం.

స్వామి టాపిక్ మార్చేసేడు.

'వాడికి తల పొగరు జాస్తిగా వుంది'

'ఎవడికి?'

'ఆ మేనేజింగ్ డైరెక్టర్ నాయర్‌కి'

'ఏమో.... అది నీ యూనియన్... నేను తలదూర్చను.

'ఇదిగో సత్యం... నిజం చెప్పాలంటే ఏ యూనియనూ మనిదిగాదు. కార్మికుల్ది. తలలు పగులగొట్టుకునేవాళ్ళు... తన్నుక చచ్చేవాళ్లూ వాళ్ళే. అది మనిద్దరికీ తెల్సు... ఇవాళ ఈ యెన్నికల్లో నిలబడ్డాం... మనిద్దరం ఒకటే అయినా, మన ముఠాలు...

'ఎందుకీ ముఠాలు...?' నిషాలో ఘాటు ప్రశ్న.

'ఎందుకేవిటి? ముఠాల్లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం ఏంవుందోయ్? మనకు బతుకు తెరువేది? ఐమీన్... బతుకు తెరువంటే... నా వుద్దేశం బతకటం కోసమని కాదు. మీనాన్న వడ్డీ వ్యాపారం చేసి బోలెడంత గడించేడు. నాకూ పిత్రార్జితం చచ్చేంత వుంది. నేను డాక్టర్ని. ఇంకా రెండు చేతులా సంపాయించగల్ను- అది గాదు.. నేను చెప్పేది. రాజకీయ మనుగడ గురించి. అక్కడమన స్థానం ఖాయంగా నిలబడాలంటే వీళ్ళు మన చేతుల్లో వుండాలి... వీళ్ళు మన అదుపాజ్ఞల్లోవుండాలంటే ఈ కార్మిక నాయకత్వం తప్పనిసరి-'

'దేనికోసం స్వామీ ఇంత వుపన్యాసం?'

'అదే- ఆ నాయర్‌కి బుద్ధిచెప్పాలి. మొన్న వో మంచి వుద్యోగం కోసం మా బావమర్దిని తీసికెళ్ళేను. ఎంత తల బిరుసుగా మాట్లాడేడు... వీణ్నిక్కణ్నుంచి షంటెయ్యాలి?'

'ఎట్లా?'

'సమ్మె చేయించాలి. వీడు వొఠి దద్దమ్మని పై వాడిని ఒప్పించి ఇక్కణ్నుంచి తరిమెయ్యాలి?'

'ఓ.కె... మాయూనియన్ కూడా మద్దతిస్తుంది.'

వెయిటర్ పరుగెత్తుకొచ్చేడు.

'సర్...'

'ఏఁవిటి నాన్నా... ఏం ముంచుకొచ్చింది!!'

'ఎవరో జగన్నాథం అంటసార్... ఆయనా మరో నలుగురూ మిమ్మల్ని చూడాలంటున్నారు.'

ఇద్దరూ ఒకళ్ళ మొగాలు ఒకరు చూసుకున్నారు.

'వీళ్ళకెలా తెల్సు మనం ఇక్కడున్నట్టు...'

ఫక్కున నవ్వేడు సత్యం.

'వాళ్ళ నాయకులెక్కడుంటారో వాళ్లకు తెలీదా?'

'రమ్మంటారా సర్...'

'ఊహు... కుదర్దని చెప్పు. .. ప్రయర్ ఎపాయింట్‌మెంటు లేకుండా కలవడం వీలుపడదు.'

వెళ్ళిపోయేడు.

ఇద్దరికీ కొంచెం చలి అనిపిస్తోంది.

మరో పది నిముషాల్లో పెద్ద అలజడి

వాళ్లు తుఫానులా తలుపులు తోసుకుని లోపలి కొచ్చేరు.

నిర్ఘాంత పోయేరు వాళ్ళ నాయకులు. చేతుల్లో గ్లాసులు అలానే వుండిపోయేయి.

'ఓ... ఉత్తర దక్షిణాల కూడలి ఇక్కడన్నమాట!'

'ఏవిటి జగన్నాథం?'

'ఏమి చెబితే మీ తలకెక్కుతుందిప్పుడు?'

'ఫర్వాలేదు చెప్పు...'

'మీరిచ్చిన వుపన్యాసాల విషం కార్మికుల బుర్రల్లోకి పాకి కొట్టుకు చస్తున్నారు. మా కుడి భుజం రాముడు కూలిపోయేడు.. మరో నలుగురికి ప్రమాదంగా ఉంది...'

'మరేమంటావు?'

'మీరు వెంటనే కదిలిరావాలని చెప్దామని ఒచ్చేను.'

'నేనొచ్చి ఏం చేయను? ప్రాక్టీస్ మానేసి చాలా రోజులైందే?...'

'అది నాకూ తెల్సు... అందుకు గాదు'

'మరెందుకు?'

'మీకు అవసరమైనప్పుడే కాదు. వాళ్లకు కష్టాలొచ్చినప్పుడు కూడా కాస్త వాళ్లకు కన్పిస్తే మంచిది. అందుక్కూడా కాదు మేం వచ్చింది. మీరు అంటించిన నెగడి మీరు ఆర్పితే తప్ప శాంతించేటట్టు లేదు.'

'నువేం కంగారు పడకు జగన్నాథం. వాళ్ళే చల్లారిపోతారు... ఉదయం చూద్దాంగా...'

జగన్నాథం మౌనంగా క్షణం నిలబడి వెనక్కి తిరిగి వెళ్ళిపోయేడు.

* * *

స్వామి యాజమాన్యానికి సమ్మె నోటీసిచ్చేడు.

సత్యం తన మద్దతును ప్రకటించేడు.

మర్నాటి నించే సమ్మె ప్రారంభం.

ఇద్దరూ తమ యూనియన్ ఆఫీసులకు వెళ్ళేరు. అక్కడ ఎలాంటి అలజడీ లేదు. నాలుగైదు పోస్టర్లు మాత్రం కన్పించేయి.

-కార్మిక నాయకులు, కార్మికుల నించే రావాలి.

-పరాన్న భుక్కుల్లారా, వెనక్కు పొండి. మీకిక్కడ స్థానం లేదు అని రాసి వున్న పోస్టర్లవి!

*(కళాసాగర్ సప్తమ వార్షికోత్సవ సంచిక 1979)*